

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.10 (309.3558)	42,898	47,600
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.69 (4.12)	2,562.74	2331.14
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.57 (45.10)	19,374	33,606

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.186 | స్కిన్‌లెస్ : రూ.216

ప్రాజెక్టుల్లో నీరు.. కాల్వల్లో పారవు

- అధ్వానంగా సాగర్ ఎడమ కాల్వలు
- మేజర్లతో పాటు మైనర్ కాల్వల్లోనూ పరిస్థితి ఆగమాగం
- పిచ్చిమొక్కలు పెరిగి శిథిలమైన కాల్వలు
- సాగర్‌లో నీరున్నా చివరి ఆయకట్టుకు అందని వైనం
- కాల్వలను పునరుద్ధరించాలని రైతుల డిమాండ్

7

చివరి ఆయకట్టుకు నీరందించాల్సిన కాల్వలు అధ్వానంగా మారాయి. కాల్వలు చెట్లు, రాళ్లతో పేరుకపోయి ఉండడంతో నీరు దిగువకు రావడం లేదు. చివరి ఆయకట్టు రైతాంగానికి నీరందిస్తామని ప్రభుత్వం చెబుతున్నా, క్షేత్రస్థాయిలో నీరు రాకపోవడంతో రైతులు అయోమయంలో ఉన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీరు విడుదల చేసి 20 రోజులవుతున్నా కాల్వలు సక్రమంగా లేకపోవడంతో ఆయకట్టు చివరి భూములకు చేరడం లేదు. కాల్వల్లో ఉన్న కంపచెట్లను తొలగించకపోవడంతో నీరు దిగువకు రావడం లేదని, వరద కాల్వపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తిరుమలగిరి(సాగర్) మండలం రాజావరం చెరువు నింపేందుకు ఏర్పాటు చేసిన చిన్న తూము



సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని కాల్వల దుస్థితికి అద్దంపడుతోంది మాడ్గులపల్లి మండలంలోని వరదకాల్వ. కాల్వ పూర్తిగా ధ్వంసం కావడంతో పాటు కట్టలపై చెట్లు, పిచ్చి మొక్కలు పెరగడంతో అసలు కాల్వ ఉన్నట్లుగానే కనిపించడం లేదు.

కొత్త రుణాల కోసం ఎదురుచూపు



- రుణమాఫీ జరిగినా ఆలస్యమవుతున్న రెన్యూవల్
- పంట రుణాలకు ఫీల్డ్ ఆఫీసర్ల కసరత్తులు
- రోజుకు 20 మాత్రమే ఫైల్స్ క్లియరెన్స్
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు 30శాతం లోపే కొత్త రుణాలు

నల్లగొండ, ఆగస్టు 22: ప్రభుత్వం మూడు విడతల్లో ఉమ్మడి జిల్లాలో రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయగా, ఇంకా మాఫీ వర్తించని అర్హులైన వారి నుంచి గ్రీవెన్స్‌ల ద్వారా అర్జీలు తీసుకొని పరిశీలిస్తోంది. ప్రభుత్వం రుణమాఫీ నిధులు విడుదల చేసినా, పలు సాంకేతిక కారణాలతో మాఫీకి నోచుకోక రైతులు ఆందోళన చెందుతున్నారు. వీరి పరిస్థితి ఇలా ఉండగా, రుణమాఫీ పొందిన రైతులు కొత్త రుణాల కోసం పడిగాపులు పడుతున్నారు.

రుణాల రెన్యూవల్ కోసం రైతులు బ్యాంకుల వద్ద క్యూ కడుతున్నారు. జాబితాలో పేరు ఉండటంతో 1-బీ, ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, పంటరుణం ఖాతా నెంబర్, సేవింగ్ ఖాతా జిరాక్స్‌లను సమర్పించేందుకు బ్యాంకు చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో రైతుకు సంబంధించిన రుణమాఫీని ప్రక్రియన్ క్లియర్ చేసేందుకు గంటలకొద్దీ సమయం పడుతోంది. గ్రామీణ ప్రాంతాలల్లో సర్వర్ బిజీగా ఉండటం, నెట్ సరిగా పనిచేయకపోవడంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. వ్యవసాయ సీజన్ ప్రారంభమై రెండున్నర నెలలు దాటినా, రుణమాఫీకి అర్హులైన రైతుల వద్ద పెట్టుబడులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక అర్హత ఉండి మాఫీ కాని రైతులు ఆందోళనతో వ్యవసాయ అధికారుల చుట్టూ, బ్యాంకర్ల చుట్టూ నిత్యం ప్రదక్షిణ చేస్తున్నారు.

కొత్త రుణం కోసం తప్పని తిప్పలు

రుణమాఫీ జరిగిన రైతులు కొత్త రుణాలకు దరఖాస్తులు చేసుకుంటుండగా, రెన్యూవల్ ప్రక్రియ ఆలస్యమవుతోంది. దేవరకొండ నియోజకవర్గంలోని పీఏ.పల్లి మండలంలో రుణమాఫీ పొందిన రైతులు బ్యాంకుకు వెళ్లగా, వచ్చే నెల 5వ తేదీ తరువాత రావాలని రైతులకు చెప్పి పంపిస్తున్నారు. నల్లగొండ మండలంలోని దోమలపల్లి బ్యాంకులో సైతం కొత్త రుణాల గురించి ఇప్పుడేం చేయలేమని, తాము ప్రస్తుతం రుణమాఫీ ప్రక్రియ బిజీలో ఉన్నామని బ్యాంకర్లు రైతులను తిప్పిపంపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని వాణిజ్య బ్యాంకులతో పాటు కోఆపరేటివ్ బ్యాంకుల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. రుణమాఫీ తొలి విడతలో నల్లగొండ జిల్లాలో 83,724మంది రైతులకు రూ.454.49కోట్లు మాఫీ కాగా, సూర్యాపేట జిల్లాలో 56,274 మంది రైతులకు రూ.282.98కోట్లు, యాదాద్రి జిల్లాలో 37,285మంది రైతులకు రూ.203.82కోట్లు మాఫీ అయ్యాయి. రెండో విడతలో నల్లగొండ జిల్లాలో 50,409మంది రైతులకు రూ.503.89కోట్లు, సూర్యాపేట జిల్లాలో 26,376మంది రైతులకు రూ.250.8కోట్లు, యాదాద్రి జిల్లాలో 19,798 మంది రైతులకు రూ.193.46కోట్లు మాఫీ అయ్యాయి. మూడో విడతలో నల్లగొండ జిల్లాలో 35,501 మంది రైతులకు రూ.442.87కోట్లు, సూర్యాపేట జిల్లాలో 17,773 మంది రైతులకు రూ.213.24కోట్లు, యాదాద్రి జిల్లాలో 13,011మందికి రూ.164.66కోట్లు మంజూరయ్యాయి. వారందరికీ కొత్తగా రుణాలు ఇవ్వాలి ఉంది. అయితే రోజుల తరబడి రుణమాఫీ ప్రక్రియతో పాటు కొత్త రుణాలు ఇవ్వడం సమస్యగా మారుతోంది.

ఆందోళన చెందుతున్న రైతులు

పంట రుణాల కోసం ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగం ఆందోళనకు గురవుతోంది. ప్రస్తుతం నాగార్జునసాగర్ ఆయకట్టు కింద ముమ్మరంగా వరినాట్లు పడనున్నాయి. మెట్ట ప్రాంతాల్లో సైతం మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలకు ఎరువులు వేస్తున్నారు. ఇప్పటివరకు పెట్టుబడులు చేతుల్లో లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుభరోసా వచ్చి ఉంటే పెటుబడులు వెళ్లేవి. కనీసం కొత్త రుణాలు వచ్చిన కూడా గట్టెక్కే పరిస్థితి ఉంటుంది. జూలై నెలలో మూడో వారంలో మొదటి విడత లక్ష రూపాయల వరకు రుణమాఫీ పొందిన రైతులతో పాటు గత నెల 30వ తేదీన రెండో విడత రూ.1.50లక్షలు, ఈనెల 15న రూ.2లక్షలు రుణమాఫీ పొందిన రైతులకు గతంలో ఎంత మేరకు రుణం ఇచ్చారో అంతే కొత్త రుణం ఇవ్వనున్నారు. దీనికి భిన్నంగా రూ.1.50లక్ష నుంచి రూ.2లక్ష వరకు కొత్త రుణం కావాలంటే ఇచ్చేందుకు బ్యాంకర్లు సుముఖంగా లేరు. గతంలో ఎంత రుణం ఉందో అంతేమొత్తం ఇచ్చేందుకు బ్యాంకర్లు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీంతో అధికంగా పంట రుణం కావాల్సిన రైతులకు నిరాశ తప్పడం లేదు.

కొత్త రుణాలు ఇవ్వలేదు

నాకు ప్రభుత్వ రుణమాఫీ వర్తించింది. కొత్త రుణం కోసం బ్యాంకుకు వెళ్తే ఇంకా మంజూరు కాలేదు. త్వరగా కొత్త రుణం ఇచ్చి ఆదుకోవాలి. పెట్టుబడి లేక పోవడంతో ఇబ్బందులు వస్తున్నాయి. ఇప్పటికే సీజన్ ప్రారంభమై రెండున్నర నెలలైంది. వెంటనే కొత్త రుణం మంజూరు చేస్తే పెట్టుబడులకు ఉపయోగపడతాయి. రైతుభరోసా కూడా వెంటనే ఇవ్వాలి. పెట్టుబడుల కోసం అప్పు చేయాల్సిన పరిస్థితి లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

ఎస్‌కె.మహమూద్, కాశీవారిగూడెం, తిప్పర్తి

ఒక్కో బ్యాంకులో 20 కొత్త రుణాలే

ఉమ్మడి జిల్లాలో కొత్త రుణాలు ఇప్పటి వరకు కేవలం 30శాతం లోపే అయింది. ప్రతీ బ్యాంకులోనూ ఫీల్డ్ ఆఫీసర్ మాత్రమే కొత్త రుణాల ప్రక్రియను చూడాల్సి ఉంటుంది. ఫీల్డ్ ఆఫీసర్‌పై తీవ్ర పనిభారం పడుతుండటంతో కేవలం ప్రతీ రోజు ఒక్కొక్కరు 20 కొత్త రుణాల ఫైళ్లను మాత్రమే క్లియర్ చేస్తున్నారు. ఫీల్డ్ ఆఫీసర్‌తో పాటు బ్యాంక్ మేనేజర్లపై అధిక పని ఒత్తిడి పడుతోంది. పనివేళలకు మించి బ్యాంకులోనే ఉంటూ మూడు విడతలకు చెందిన రుణమాఫీ జాబితాను క్లియర్ చేయడం, మరోవైపు కొత్త రుణాలపై దృష్టి సారించాల్సిన పరిస్థితి ఉంది. ఈ సమస్యలు ఇలా ఉండగా, రుణమాఫీ పొందని రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారు. రాజకీయ పార్టీలు సైతం రుణమాఫీ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నాయి. గ్రీవెన్స్‌ల ద్వారా వచ్చిన అర్జీలను పరిష్కరించే పనిలో వ్యవసాయశాఖ తలమునకలై ఉంది. వాస్తవానికి వ్యవసాయ సీజన్ ప్రారంభమై రెండున్నర నెలలు దాటినా రుణమాఫీ సమస్యతో పాటు కొత్త రుణాలు కొలిక్కి రావడం లేదు. దీనికి తోడు రైతుబంధు స్థానంలో వచ్చిన రైతుభరోసాపై ఇప్పటి వరకు ప్రభుత్వం ఓ నిర్ణయానికి రాకపోవడంతో రైతుభరోసా పెట్టుబడులు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



యాదాద్రి జిల్లా ఆలేరులో ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీ‌ష్‌రావు

రుణమాఫీ అయ్యేవరకూ ఉద్యమిస్తాం

ఏ ఒక్కగ్రామంలో మాఫీ వంద శాతం చేసినా రాజీనామాకు సిద్ధం : మాజీ మంత్రి హరీ‌ష్‌రావు

ఆలేరు రూరల్, ఆగస్టు 22: రూ.2లక్షల రుణమాఫీ అయ్యే వరకూ ఉద్యమిస్తామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీ‌ష్‌రావు అన్నారు. గురువారం ఆలేరులో అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన రుణమాఫీ కాని రైతుల ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో శృతిలేని పాలన, పొంతనలేని సీఎం, మంత్రుల మాటల మధ్య భేదాలు కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రం మోసాలకు అడ్డాగా మారిందని, ఈ విషయమై అసెంబ్లీలో కొట్లాడడంతోపాటు ప్రజలతో కలిసి కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమిస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏకకాలంలోనే రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని నమ్మించి తెలంగాణ రైతన్నలను మోసం చేశారన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క గ్రామంలో వందశాతం రూ.2లక్షల రుణమాఫీ జరిగినా తాను రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. కాంగ్రెస్ పాలనలో పాత్రికేయులు, శాసనసభ్యులపై దాడులు జరగడం హేయమైన చర్య అన్నారు. తమ మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌పై జరిగిన దాడినే నిదర్శనమన్నారు. వ్యవసాయం ప్రజల జీవన విధానం అని, రైతు బాగుంటేనే దేశం బాగుంటుందన్న లక్ష్యంతో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ రైతు ప్రభుత్వంగా పరిపాలించారని కొనియాడారు. నాడు కేసీఆర్ నాయకత్వంలో మిషన్ కాకతీయ పేరుతో చెరువుల మరమ్మతులు, పలు ప్రాజెక్టుల నిర్మాణం, చెక్ డ్యామ్‌ల నిర్మాణం, 24గంటలపాటు నాణ్యమైన కరెంట్, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లాంటి అద్భుత పథకాలను అమలు చేశారన్నారు. అలాంటి పథకాలకు తిలోదకాలు పలికిన సీఎం రేవంత్‌ను తెలంగాణ ప్రజలు విశ్వసించడం లేదన్నారు. ధాన్యానికి బోనస్ ఇస్తామన్నది బోగస్‌గా మారిందన్నారు. రేవంత్‌రెడ్డి ఎక్కడెక్కడ ప్రమాణం చేశారో, అక్కడికి వెళ్లి రేవంత్‌రెడ్డిని క్షమించి ప్రజలను కాపాడాలని పూజలు చేస్తామన్నారు. కాగా, కొండపైన దేవస్థాన సంప్రదాయాలకు విరుద్ధంగా హరీ‌ష్‌రావు ప్రత్యేక పూజారితో పూజలు నిర్వహించి అపవిత్రం చేశారని, మాఢవీధులను ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చి విప్ బీర్ల అయిలయ్యతోపాటు కాంగ్రెస్ కార్యకర్తలు శుభ్రం చేశారు.

తిరుమలగిరిలో ఉద్రిక్తత

తిరుమలగిరి: సూర్యాపేట జిల్లా తిరుమలగిరి పట్టణంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల పోటాపోటీ కార్యక్రమాలు ఉద్రిక్తతకు దారితీశాయి. అందరికీ రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షాశిబిరంపై కాంగ్రెస్ నాయకుల దాడి, ఆ తర్వాత బీఆర్ఎస్ నాయకులు ప్రతిదాడితో ఒక్కసారిగా ఉద్రిక్త నెలకొంది. ఇరువర్గాలను పోలీసులు చెదరగొట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఇరువర్గాల దాడుల్లో బీఆర్ఎస్ నాయకులు ఐదుగురు, కాంగ్రెస్ నాయకులు ముగ్గురు గాయపడ్డారు. అదేవిధంగా ముగ్గురు కాంగ్రెస్ కార్యకర్తలు స్వల్పంగా గాయపడ్డారు. ఇదిలా ఉండగా, గాయపడిన కార్యకర్తలను పరామర్శించేందుకు తిరుమలగిరికి వెళ్తున్న మాజీమంత్రి జగదీ‌ష్‌రెడ్డిని పోలీసులు అర్వపల్లి మండలం తిమ్మాపురం వద్ద అడ్డుకున్నారు. పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో ఆ తర్వాత వెళ్లేందుకు అనుమతించారు. తిరుమలగిరి జగదీ‌ష్‌రెడ్డి మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లోనే బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడి జరిగిందని ఆరోపించారు. ఎన్ని దాడులు చేసినా రైతుల తరపున పోరాటం చేస్తామని అన్నారు.

ఇదిలా ఉండగా, జిల్లా కేంద్రంతోపాటు దేవరకొండ, మిర్యాలగూడ, హాలియా, చండూరుతో పాటు పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో నిరసన దీక్షలు, రాస్తారోకోలు జరిగాయి.



తిరుమలగిరిలో ఇరువర్గాలను అడ్డుకుంటున్న పోలీసులు

పర్యాటకంగా చాకలిగట్టు అభివృద్ధికి కృషి

పర్యాటకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణిప్రసాద్

నాగార్జునసాగర్, ఆగస్టు 22: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ జలాశయం మధ్యలో ఉన్న జింకల సంరక్షణ కేంద్రమైన చాకలిగట్టును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణిప్రసాద్ అన్నారు. పర్యాటకశాఖ ఎండీ ప్రకా‌ష్‌రెడ్డి, డైరెక్టర్ ఈల త్రిపాఠీతో కలిసి చాలకలిగట్టు, హిల్‌కాలనీలో ఉన్న బుద్ధవనం ప్రాజెక్టును గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జలాశయం మధ్యలో సుమారు 400 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చాకలిగట్టుకు పర్యాటకశాఖ ఆధ్వర్యంలో లాంచీలు నడపడంతో పాటు అక్కడ కాటేజీలు, హోటళ్లు, వాటర్ గేమ్స్, వాక్ వేలు, సైక్లింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తే పర్యాటకంగా మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. చాకలిగట్టుపై అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తే దేశ విదేశాల నుంచి పర్యాటకుల రాక మరింతగా పెరుగుతుందన్నారు. అలాగే ఏలేశ్వరం కొండకు కూడా లాంచీలు నడిపిస్తే ఆధ్యాత్మికంగా పర్యాటకులకు మరింత వీలుగా ఉంటుందన్నారు. ఆ పక్కనే ఉన్న నాగార్జునకొండను కూడా కలుపుతూ పర్యాటక సర్క్యూట్‌గా ఏర్పాటు చేస్తే పర్యాటకులను మరింతగా ఆకర్షించవచ్చని, ఆ దిశగా ఆలోచనలు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.



జలాశయం మధ్యలో ఉన్న చాకలిగట్టును పరిశీలిస్తున్న అధికారులు

బుద్ధవనంలో మరిన్ని అభివృద్ధి పనులు

హిల్‌కాలనీలో 274 ఎకరాల్లో నిర్మితమైన బుద్ధవనంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని పర్యాటకశాఖ ఎండీ ప్రకా‌ష్‌రెడ్డి అన్నారు. బుద్ధవనంలో ఇప్పటికే ఉన్న వివిధ దేశాల స్తూపాలతో పాటు మరిన్ని దేశాల బౌద్ధ మత స్తూపాలను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే వాచ్ టవర్, కాటేజీలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. బుద్ధవనం నల్లమల అటవీ ప్రాంతంలో ఉండటంతో అటవీ జంతువులు రాకుండా తగిన రక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు అటవీ శాఖ అధికారులను సంప్రదించి చర్చిస్తామన్నారు. చాకలిగట్టు, ఏలేశ్వరం కొండకు లాంచీలు నడిపేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో టూరిజం మాజీ ఎండీ, బుద్ధవనం మెంటర్ చెన్నూరి ఆంజనేయరెడ్డి, పురావస్తుశాఖ డిప్యూటీ డైరెక్టర్లు నారాయణ, నాగరాజు, టూరిజం సీఈ వెంకటరమణ, హోటల్స్ జీఎం నాథన్, టూరిజం వాటర్ ఫ్లూయిట్ మేనేజర్ ఇబ్రహీం, బుద్ధవనం ఓఎస్‌డీ సూదన్‌రెడ్డి, ఎఫ్‌డీవో సంగీత, బుద్ధవనం డీఈలు దామోదర్, సుదర్శన్, శిల్పి శ్యాం, బౌద్ధ విశ్లేషకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, ఏఈ నజీస్, విజయవిహార్ మేనేజర్ కిరణ్‌కుమార్, లాంచీస్టేషన్ మేనేజర్ హరి, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఉదయసముద్రం నుంచి సాగునీరు



ఉదయసముద్రం రెగ్యులేటరీని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ టౌన్, ఆగస్టు 22: ఉదయసముద్రం రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు త్వరలో సాగునీరు విడుదల చేస్తామని, రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ సి.నారాయణరెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఉదయ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఇన్‌ఫాల్, ఔట్‌ఫాల్ రెగ్యులేటరీలను ఆయన పరిశీలించారు. అక్కంపల్లి రిజర్వాయర్ హైలెవల్ కెనాల్ ద్వారా ఉదయ సముద్రానికి నీరు వస్తుండగా, ఇక్కడి నుంచి డీ-39, డీ-40 ద్వారా ఆయకట్టుకు నీరుపారే కాల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీ-39 కింద 10వేల ఎకరాలు, డీ-40 కింద 27వేల ఎకరాలు సాగు అవుతుండగా, నీటిమట్టం పెరిగాక అన్ని చెరువులు, కుంటలను నింపాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మూసీ నది కింది భాగంలో ఉన్న డీ-55 వరకు నీరందించేందుకు యత్నాన్ని చేస్తామన్నారు. రైతులందరికీ సాగునీరు అందుతుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కలెక్టర్ వెంట ఈ ఈలు జి.శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రావు, డీఈ ఆనందరావు, తదితరులు ఉన్నారు.

నూతన రెవెన్యూ చట్టంపై నేడు బహిరంగ చర్చ: భూరికార్డుల క్రమబద్ధీకరణకు నూతన ఆర్‌వోఆర్ ముసాయిదా చట్టం-2024 (రికార్డ్స్ ఆఫ్ రైట్స్)పై శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు కలెక్టరేట్‌లో బహిరంగ చర్చ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రైతు సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, విశ్రాంత అధికారులు హాజరై సూచనలు ఇవ్వాలని కోరారు.

నిరుద్యోగులకు ఉపయోగం లేని ఐటీ హబ్

- నిర్లక్ష్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఐటీ హబ్‌ను పరిశీలించిన బీజేపీ నాయకులు

నల్లగొండ, ఆగస్టు 22: జిల్లా కేంద్రమైన నల్లగొండ పట్టణంలో సుమారు రూ.96కోట్లతో నిర్మించిన ఐటీ హబ్ నిర్వీర్యంగా మారిందని, నిరుద్యోగులకు ఉపయోగం లేకుండా పోయిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజుయాదవ్ ఆరోపించారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారు ప్రసాద్‌తో కలిసి ఐటీ హబ్‌ను సందర్శించిన అనంతరం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐటీ హబ్ నిర్మించి వందల కంపెనీలు ఐటీ హబ్‌కు వస్తాయని, 3వేల మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని చెప్పి మోసం చేశారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి జాబ్‌మేళాను నిర్వహించినా, ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని, కేవలం 8 కంపెనీల్లో 40 నుంచి 50 మంది ఉద్యోగులు మాత్రమే పనిచేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి ఐటీ హబ్‌ను దుర్వినియోగం చేసిందన్నారు. అదేవిధంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ నిరుద్యోగులను పట్టించుకోవడం లేదన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెలీకాప్టర్‌లో వచ్చి పోవడం తప్ప నియోజకవర్గాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఐటీ హబ్‌లో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయని అన్నారు. త్వరలోనే తమ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగుల పక్షాన ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని కూల్చి వేయాలని అధికారులను ఆదేశించినా వారు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా రాజకీయాలు పక్కన పెట్టి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. యువతులకు స్కూటీలు ఉచితంగా ఇస్తామని చెప్పి ఇవ్వడం లేదని, ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం విస్మరించిందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ రాకుండా చేస్తామన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పోతేపాక సాంబయ్య, పెరిక ముని, రాఖీ, బొజ్జ నాగరాజు, గుర్రం వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఐటీ హబ్‌ను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ఫ్లైఓవర్ బ్రిడ్జి పిల్లర్లతో నిర్మించాలి

చిట్యాల, ఆగస్టు 22: చిట్యాలలో జాతీయ రహదారిపై నిర్మించే ఫ్లైఓవర్ బ్రిడ్జ్ సిమెంట్ పిల్లర్లతో నిర్మించాలని అఖిలపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. గురువారం చిట్యాలలో సీపీఎం ఆధ్వర్యంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మట్టి కట్టతో నిర్మించడం వల్ల వ్యాపారాలు దెబ్బతింటాయని, చిట్యాల పట్టణం రెండు భాగాలుగా విడిపోతుందన్నారు. సిమెంట్ పిల్లర్లతో నిర్మించడం కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.

ప్రాజెక్టులో నీరు.. కాల్వల్లో పారవు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. దీంతో ప్రాజెక్టు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆయకట్టుకు నీరందిం చేందుకు నిర్మించిన వరదకాల్వలు అధ్వానంగా ఉండడంతో చివరి భూములకు నీరందడం లేదు. చెట్లు, రాళ్లు నిండడంతో దిగువకు నీరు రాలేని పరిస్థితి ఉంది. చివరి ఆయకట్టు రైతాంగానికి నీరందిస్తామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో దిగువ పంట పొలాలకు నీరు రాక రైతులు అయోమయంలో ఉన్నారు.



సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో కంపచెట్లతో నిండి ఉన్న మైనర్ కాల్వ

కుంచించుకుపోతున్న కాల్వలు

పాలకవీడు: నాగార్జునసాగర్ ఎడమకాల్వ కింద ఉన్న జాన్‌పహాడ్ మేజర్ ఆయకట్టు పాలకవీడు మండలంలో పరిస్థితి దారుణంగా ఉంది. కాల్వ చివరి భూములు కావడంతో ప్రతి ఏటా నీటికి కష్టాలు తప్పడం లేదు. జాన్‌పహాడ్ మేజర్ కింద బొత్తలపాలెం, అలింగాపురం, నాగిరెడ్డిగూడెం, పాలకవీడు, యల్లాపూరం, సజాపురం, జాన్‌పహాడ్ ప్రాంతాలకు నీరు చేరాలంటే కనీసం కాల్వ వదిలిన 15రోజుల వరకు కూడా నీరు వచ్చే పరిస్థితి లేదు. కాల్వ చివరి భూములు కావడంతో పాటు కాల్వల ఆధునికీకరణ కాలేదు. కాల్వలు కుంచించుకు పోయి చిన్నవిగా మారాయి. వాటికింద వున్నమైనర్ కాల్వలు చిన్నకాల్వలుగా ఉంటాయి. వాటిని ఉపాధిహామీ పనుల ద్వారా ఇటీవల నామమాత్రంగా తీశారు. జాన్‌పహాడ్ మేజర్ కాల్వ కింద పాలకవీడు మండలంలో సుమారు 15వేల ఎకరాలు సాగవుతుంది. జాన్‌పహాడ్ మేజర్ పరిధిలో మైనర్, సబ్‌మైనర్‌లుగా విభజించారు. ఆర్-9, ఆర్-10, ఆర్-11, ఆర్-12, ఆర్-13, ఆర్-14, ఆర్-15 సబ్ మైనర్ కాల్వలుగా మండలంలో సాగునీరు అందుతుంది. వీటిలో కొంత కాల్వ లైనింగ్ పనులు చేపట్టారు. కాల్వకట్టలకు లైనింగ్‌లేని చోట బలహీనంగా ఉన్నాయి. చాలా చోట్ల చెట్లతో కాల్వలు నిండి ఉన్నాయి. కాల్వనీరు చివరి భూములకు అందక పోవడంతో నిత్యం ప్రతిఏడాది రైతుల మధ్య వివాదాలు జరుగుతున్నాయి. ఎగువ ప్రాంతంలో ఉన్న రైతాంగమే పూర్తిస్థాయిలో నీటిని వాడుకుంటుండడంతో కింది ఉన్న రైతులు వచ్చే కొద్దిపాటి నీటికి బోర్లు, బావులపై ఆధారపడి వరిసాగు చేస్తున్నారు.

రాజవరం చివరి భూములకు అందని సాగునీరు

తిరుమలగిరి(సాగర్): నాగార్జునసాగర్ ఎడమకాల్వకు మొదటి మేజర్ రాజవరం. దశాబ్దాలుగా ఆ మేజర్ పరిధిలోని చివరి భూములకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. కొంపల్లి నుంచి బోయగూడెం, రాజవరం గ్రామాల చివరి రైతులు సాగునీటి కోసం ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని ప్రతి ఏటా స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో అక్కడి రైతులు ఆవేదన చెందుతున్నారు. మేజర్ పరిధిలో మొత్తం ఆయకట్టు విస్తీర్ణం 8,900 ఎకరాలు కాగా అందులో సుమారు మూడు వేల ఎకరాల్లో గల చివరి భూములకు సాగునీరు అందే పరిస్థితి కన్పించడం లేదు. సాగర్ ఎడమకాల్వకు అల్వాల వద్ద రాజవరం మేజర్‌కు సాగునీటినీ అందించేందుకు ఎన్ఎస్పీ అధికారులు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి సుమారు 26కిలోమీటర్ల మేరా రాజవరం వరకు మేజర్ కాల్వను నిర్మించారు. మేజర్‌కు చివర ఉన్న సుమారు 18వ కిలోమీటర్ నుంచి 26వ కిలోమీటర్ వరకు ఈ ప్రాంత ఆయకట్టు రైతులకు సాగునీరు ఇబ్బందులు తప్పట్లేదని వాపోతున్నారు. మేజర్, మైనర్ కాల్వల్లో పేరుకపోయిన పూడికతీతను ఎన్ఎస్పీ సిబ్బంది చేపట్టడం లేదు.

ఫౌండేషన్ సహాయంతో పూడికతీత

రాజవరం మేజర్ కాల్వ ప్రారంభమయ్యే అల్వాల గ్రామ శివారు నుంచి మొదలుకోని ఎల్లాపురం సమీపంలోని 16వ కి.మీ వరకు బుసిరెడ్డి ఫౌండేషన్ సహకారంతో కాల్వలో పూడికతీత పనులు చేపట్టారు. సాగర్ జలాశయం నిండడంతో రాజవరం మేజర్‌కు సాగునీరు విడుదల చేసే అవకాశాలు ఉండడంతో రైతులు బుసిరెడ్డి ఫౌండేషన్ ఛైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డిని కలిసి కాల్వల పరిస్థితిని విన్నవించారు. ఈనెల మొదటి వారంలో మూడు ఎక్సవేటర్లు, మూడు డోజర్ల సహాయంతో మేజర్ కాల్వ ప్రారంభమయ్యే 0కిలో మీటర్ నుంచి ఎల్లాపురం సమీపంలోని 16వ కిలో మీటర్ వరకు సుమారు. రూ2.50లక్షలతో సుమారు వారం రోజుల పాటు యంత్రాలతో పనులు చేయించి మేజర్ కాల్వలో పేరుకపోయిన పూడిక తీయించి శుభ్రం చేయించారు. దీంతో ప్రస్తుతం ఎల్-4 కాల్వ వరకు సాగునీరు సాఫీగా అందుతున్నా 16వ కిలో మీటర్ నుంచి రాజవరం చివరి భూములైన 26వ కి.మీ వరకు కాల్వలో చెత్త, పిచ్చిచెట్లు పేరుకపోయి అస్తవ్యస్తంగా ఉండడంతో నీరు పారకపోవడంతో చివరి ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

వరదకాల్వలో పేరుకపోయిన చెట్లు

మాడ్గులపల్లి: వరదకాల్వ ద్వారా చివరి ఆయకట్టుకు నీరందించేందుకు ఏర్పాటు చేసిన వరదకాల్వ అధ్వానంగా మారింది. కాల్వలో చెట్లు, రాళ్లతో పేరుకపోయి నీరు కిందకు రాలేని పరిస్థితి ఉంది. సాగర్‌లో నీరు సమృద్ధిగా నీరు ఉన్నా వరద కాల్వకు నీరు విడుదల చేసి 20 రోజులవుతున్నా ఇప్పటి వరకు కిందకు నీరు రాకపోవడంతో వరదకాల్వ పరిధిలో ఉన్న కన్నెకల్, నారాయణపురం, దాచారం, మాడ్గుల పల్లి, మర్రిగూడెం, తోపుచర్ల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాల్వల్లో ఉన్న కంపచెట్లను తొలగించకపోవడంతో నీరు కిందకు రావడం లేదని, అధికారులు వరదకాల్వపై పర్యవేక్షణ సక్రమంగా చేయకపోవడంతో కాల్వలు ఇలా తయారయ్యాయని గ్రామాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాల్వల మరమ్మతులు లేక..

పెన్‌పహాడ్: సాగర్ కాల్వ కింద ఉన్న ఎత్తిపోతల పథకాలు నిర్వహణ బాధ్యత రైతులకు అప్పగించడంతో కాల్వల మరమ్మతులు లేక చివరి భూములకు సాగునీరు అందక రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మండలంలోని అనంతారం ఎల్-24 పరిధిలో 1,200ఎకరాల ఆయకట్టు ఉంది. దోసపహాడ్ ఎల్-22, 23పరిధిలో 2,838ఎకరాల ఆయకట్టు ఉంది. నాగులపాటిఅన్నారం ఎల్-25,26 పరిధిలో 2,311 ఎకరాలు ఉన్నాయి. మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం కింద ఎల్-27లో పెన్‌పహాడ్ మండలంలోని లింగాల, దూపహాడ్, ఎల్లప్ప కుంటతండా, సీతమ్మతండా, బంజారా హిల్స్ గ్రామాలకు నాలుగు వేల ఎకరాలకు నీరు రావల్సి ఉంది. ఈ నాలుగు ఎత్తిపోతల పథకాల కింద కాల్వల మరమ్మతులు లేకపోవ డంతో సుమారు 2,48ఎకరాల వరకు చివరి భూములు బీడు భూములుగా ఉండే పరిస్థితి నెలకొంది. రైతుల అసమర్థత, నిర్వహణ లోపంతో ఈ పరిస్థితి నెలకొంది. ఎత్తిపోతల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వమే చేపడితే అన్ని లిఫ్టుల కింద ఉన్న ఆయకట్టు భూములు సేద్యమయ్యే అవకాశంఉందని రైతులు తెలిపారు. మండలంలోని ఎస్సారెస్పీ కాల్వలను ఉపాధి కూలీలతో మరమ్మతులు చేసినప్పటికీ ఎస్సారెస్పీ కాల్వ లకు సాగునీరు రాక కాల్వలన్నీ నిరుపయోగంగా ఉన్నాయి.

కాల్వలో మొలిచిన కంపచెట్లు



చివరి రైతులకు సాగు భారం

దామరచర్ల: దిగువ ఆయకట్టు ప్రాంతమైన దామరచర్ల, అడవిదేవులపల్లి మండలా లకు తాగు, సాగునీరందని పరిస్థితి నెలకొంది. కాల్వల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడమే దీనికి కారణం. దామరచర్ల మండలంలోని వజీరాబాద్ మేజర్ కాల్వకు సుమారు 500క్యూసెక్కుల నీటిని విడుదల చేసినా ఆయకట్టు చివరి భూములకు నీరం దని పరిస్థితి ఉంది. ఎగువ ప్రాంతంలో సాగువిస్తీర్ణం ఇటీవల గణనీయంగా పెరిగింది. దీంతో ఎగువ రైతులు అక్రమంగా షట్టర్లు ధ్వంసం చేయడం, కాల్వలకు గండ్లు పెట్టడంతోపాటు అడ్డుకట్టలు వేస్తుండడంతో దిగువకు నీరందడం లేదు. వజీరాబాద్ మేజర్ పరిధిలోని దామరచర్ల, వాచ్యాతండా, తాళ్లవీరప్పగూడెం, బొత్తలపాలెం, ఇర్కి గూడెం, వాడపల్లితోపాటు పలు గ్రామాల్లోని సుమారు 10వేల ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందని పరిస్థితి ఉంది. తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ముదిమాణిక్యం మేజర్ పరిధిలోని అడవి దేవులపల్లి మండలంలోని ముదిమాణిక్యం, అడవిదేవుల పల్లి, బాల్నెపల్లి, చిట్యాల గ్రామాతోపాటు పలు గ్రామాల్లోని చివరి భూములకు నీరందడంలేదని అధికారులు స్పందించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.



పిచ్చిమొక్కలతో నిండిన వజీరాబాద్ మేజర్ పరిధిలోని మైనర్ కాల్వ

చెరువులు నింపేదెన్నడో?

నిడమనూరు: రెండేళ్ల తర్వాత నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో కాల్వలకు నీటిని విడుదల చేశారు. కాల్వల నిండా నీటితో ప్రవహిస్తున్నప్పటికీ మండలంలోని చెరువులు మాత్రం ఎండిపోయి ఉన్నాయి. సాగర్ నీటితో చెరువులను నింపాలని కలెక్టర్ సైతం ప్రకటించారు. కానీ చెరువులకు నీరు కూడా చేరలేదు. మండలంలో నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో 23చెరువులు ఉన్నాయి. రెండేళ్లుగా సరైన వర్షాలు లేనందున చెరువులు ఎండిపోయాయి. కొన్ని చెరువుల్లో చుక్క నీరు లేక మైదానంలా కనిపిస్తున్నాయి. కాల్వలకు నీటిని వదలడంతో చెరువులు నింపుతారని రైతులు ఆశించారు. కలెక్టర్ కూడా ప్రకటనలు చేయడంతో చెరువులు నింపడంపై రైతుల్లో ఆశలు పెరిగాయి. **ఫీడర్ చానళ్లు లేక ఇబ్బందులు:** సాగర్ నీటితో నేరుగా చెరువులు నింపడానికి ప్రత్యేక తూములు, ఫీడర్ చానళ్లు లేవు. పంట పొలాల ద్వారా వచ్చే ఎంతోకొంత నీరే శరణ్యం. ప్రభుత్వాలు చర్యలు తీసుకొని ఫీడర్ చానళ్లు, ప్రత్యేక తూములు ఏర్పాటు చేస్తే చెరువులను సాగర్ నీటితో నింపడం సులభంగా ఉండేది. అవేమీ లేకపోవడంతో చెరువులు నింపడం సాధ్యం కావడం లేదు. వరద కాల్వ నీటితో మండలంలోని గుంటిపల్లి, ఊట్కూరు చెరువులు నిండే అవకాశముంది. అనుముల మండలం మారెపల్లి పరిధిలో ఇటీవల వరద కాల్వకు గండి పడడంతో నీటి విడుదల ఆలస్యమై చెరువులకు నీరు చేరడం లేదు.



నీరు లేక ఎండిపోయిన నిడమనూరు చెరువు

చెరువులకు చేరని సాగర్ జలాలు

మేళ్లచెర్వు: నాగార్జునసాగర్ జలాలు విడుదల చేసి 20 రోజులు అవుతున్నా చెరువులు నింపడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. మండల పరిధిలోని అనేక చెరువులకు నేటి వరకు సాగర్ జలాలు చేరకపోవడంతో పాటుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులలో వర్షపు నీరు కూడా చెరువులోకి రాకపోవడంతో మండల వ్యాప్తంగా ఉన్న చెరువుల కింద సాగు ఆలస్యం అవుతుందని రైతులు చెబుతున్నారు. అధికారులు, మంత్రి ఆదేశాల మేరకు ప్రత్యేక చొరవ తీసుకొని ఆయకట్టులోని చెరువులను సాగర్ నీటిలో నింపాలని రైతులు కోరుతున్నారు.



నీటి లభ్యత లేక ఎండిన కందిబండ పెద్దచెరువు



ముల్కలకాల్వ వద్ద పిల్ల కాల్వను తలపిస్తున్న మేజర్

పేరుకే ముల్కలకాల్వ మేజర్

మిర్యాలగూడ రూరల్: చివరి గ్రామమైన ముల్కలకాల్వకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మేజర్ కింద దొండవారిగూడెం, తడకమళ్ల, తక్కెళ్లపాడు, ఉట్లపల్లి, కాల్వపల్లి, సుబ్బారెడ్డిగూడెం, అవంతీపురం, ఆలగడప, రాయినిపాలెం గ్రామాల పరిధిలోని వ్యవసాయ భూములకు, చెరువులను నింపేందుకు ముల్కలకాల్వ మేజర్ ప్రధానమైంది. ఏళ్ల తరబడి మేజర్ ద్వారా చివరి గ్రామానికి సాగునీరు అందడం లేదని అధికారులకు చెప్పినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ముల్కలకాల్వ గ్రామ పరిధిలో సుమారు 1,700 ఎకరాలకు పైగా సాగునీరు అందించాల్సి ఉన్నప్పటికీ మేజర్ కాల్వ పిల్ల కాల్వను తలపించేలా మారింది. అవంతీపురం, ఆలగ డప, రాయినిపాలెం వరకు విస్తృతంగా ప్రవహిస్తున్న మేజర్ కాల్వకు తూముల వద్ద షట్టర్లు ఏర్పాటు చేయకపోవడంతో పొలాల్లోని మడుల్లో నీళ్లు నిండి సాగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ముల్కలకాల్వకు సమీపంలోని ఆలగడప క్యాంపు వద్ద రహదారిపై కాల్వ ప్రవహిస్తున్నా ఎన్ఎస్పీ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రాయినిపాలెం వరకు ప్రవహిస్తున్న నీరు ముల్కలకాల్వ చేరుకునే వరకు పిల్లకాల్వలో వృథా నీరు ప్రవహిస్తున్న మాదిరిగా దుస్థితి నెలకొంది.

తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్

కట్టంగూరు, ఆగస్టు 22: తాళం వేసిన ఇళ్లలో రాత్రిపూట దొంగతనాలకు పాల్పడిన దొంగను నల్లగొండ జిల్లా కట్టంగూరు పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణం గణేష్ టెంపుల్ గ్రామానికి చెందిన షేక్ ఇర్ఫాన్ రాత్రి సమయాల్లో తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న బంగారు అభరణాలు, డబ్బులు దొంగిలించేవాడు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ఇర్ఫాన్‌పై 15కేసులు ఉన్నాయి. 2024 ఆగస్టు 2వ తేదీన ఖమ్మంకు చెందిన అబ్రారుద్దీన్‌కు చెందిన ద్విచక్ర వాహనం తీసుకున్న ఇర్ఫాన్ నకిరేకల్ పట్టణంలో ఫ్లైఓవర్ కింద హెయిర్ కటింగ్ షాఫ్ తాళం పగులగొట్టి రూ.12వేలు దొంగిలించాడు. అయిటిపాముల గ్రామంలో ఓ ఇంటి తాళం పగులగొట్టి రెండు తులాల బంగారు నెక్లెస్, తులం చెవి దిద్దులు, మాటీలు, వెండి పట్టీలు, పావుతులం నల్లపూసల గొలుసు, రూ.3వేల నగదు దొంగిలించాడు. గురువారం నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇర్ఫాన్ పట్టుబడినట్లు ఎస్ఐ ఎన్. శ్రీను తెలిపారు. నేరస్థుడి నుంచి రెండు తులాల బంగారు నెక్లెస్, తులం చెవి దిద్దులు, మాటీలు, పావు తులం నల్లపూసల గొలుసు, రూ.3వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు, ఇనుపరాడ్లు ఇనుప కత్తెర స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చింతపల్లి, ఆగస్టు 22: నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం పోలేపల్లిరాంగర్ గ్రామ శివారు బస్‌షెల్టర్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించింది. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 65 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి పది రోజులుగా గ్రామంలో భిక్షాటన చేస్తూ బస్‌షెల్టర్‌లో ఉండే వాడు. గ్రామ కార్యదర్శి గుర్రం ప్రదీప్‌కుమార్ గురువారం ఉదయం మాల్ నుంచి ద్విచక్ర వాహనంపై మండల కార్యాలయానికి వెళ్తుండగా గ్రామ శివారు బస్‌షెల్టర్‌లో నిర్జీవంగా పడి ఉన్న ఆ వ్యక్తిని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా మృతదేహాన్ని దేవరకొండలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ప్రదీప్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్సపొందుతూ ఇద్దరు మృతి

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 22: టైర్ రీట్రెడింగ్ కంపెనీ యజమాని దాడిలో గాయపడి కోమాలోకి వెళ్లిన వ్యక్తి చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి సమీప బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని రామచంద్రగూడెం సమీపంలోని వంశీటైర్ రీట్రెడింగ్ కంపెనీలో హౌసింగ్‌బోర్డుకు చెందిన వేల్పుల గోపయ్య(53) కొంతకాలంగా పనిచేస్తున్నాడు. పనికి ఆలస్యంగా వచ్చాడన్న ఆగ్రహంతో కంపెనీ యజమాని అలుగుబెల్లి రాఘవరెడ్డి కర్రతో గోపయ్యపై దాడిచేశాడు. జూన్ 29న జరిగిన ఈ సంఘటనలో తలకు బలమైనగాయమై గోపయ్య కోమాలోకి వెళ్లాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ గురువారం మృతిచెందాడు. కంపెనీ యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మృతుడి బంధువులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసి ఆందోళనకు సిద్ధమయ్యారు. ఎస్ఐ సుధీర్‌కుమార్ స్పదించి న్యాయం చేస్తామంటూ హామీ ఇచ్చారు. టైర్ రీట్రెడింగ్ కంపెనీ ప్రతినిధులనుస్టేషన్‌కు రప్పించారు. దీంతో కొందరు పెద్దమనుషులు జోక్యం చేసుకొని ఇరువర్గాలతో చర్చలు జరిపి నష్టపరిహారం చెల్లించేలా రాజీకుదిర్చడంతో మృతుడి బంధువులు శాంతించి వెళ్లిపోయారు. కాగా గోపయ్యకు భార్య చంద్రకళ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన కాంగ్రెస్ కార్యకర్త మృతి

బోనాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తన ఫొటో ఉంచకుండా అవమానించారన్న మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ నెల 17వ రాత్రి మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన ఆటో డ్రైవర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్త తేజావత్ భగవాన్‌నాయక్(42) ఒంటిపై పెట్రోల్‌పోసుకొని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయపడ్డ భగవాన్‌నాయక్ హైదరాబాద్ గాంధీఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. ఐదురోజులుగా మృత్యువుతో పోరాడుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించి మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య మంజుల, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కాగా భగవాన్‌నాయక్ మృతికి కారణమైనవారిపై బాధితకుటుంబ సభ్యులు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



జానీపాషా మృతదేహం

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 22: రోడ్డు ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండజిల్లా మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామం వద్ద కోదాడ -జడ్చర్ల రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన షేక్ జానీ పాషా(37) డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా నుంచి టమాట లోడ్‌తో మిర్యాలగూడకు వస్తున్న క్రమంతో తుంగపాడు గ్రామం వద్దకు రాగానే వేగంగా ముందు వెళ్తున్న టీజీ12టీ 0960 నెంబర్‌గల డీసీఎం లారీ డ్రైవర్ స్పీడ్ బ్రేకర్ వద్ద సడన్‌బ్రేక్ వేశాడు. దీంతో వెనుక వస్తున్న టీఎస్05 యూఎఫ్ 0311 నెంబర్‌గల డీసీఎం వాహనం అదుపుతప్పి వెనకనుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో డీసీఎం నడుపుతున్న డ్రైవర్ జానీపాషాకు ఛాతి, కాళ్ల వద్ద బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. జానీపాషా భార్య ఆరీఫా ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన మరో డీసీఎం డ్రైవర్ ఖాజాషరీఫ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

చందంపేట: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చందంపేట మండలం లోని గుంటిపల్లి స్టేజీ వద్ద బుధవారం రాత్రి జరిగింది. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం ఆర్కపల్లికి చెందిన జటావత్ మధు(21) బుధవారం చందంపేట మండలం పోల్యానాయక్‌తండాలో ఉంటున్న తన అక్క వద్దకు సీత్లాపండగకు వచ్చాడు. ద్విచక్రవాహనంపై తిరిగి తన స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గంమధ్యలో గుంటిపల్లి స్టేజీ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మధు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్‌లపై చర్యలు

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 22: విధులకు గైర్హాజరై విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన పీఏపల్లి మండలం మేడారం గ్రామ పంచాయతీ కార్యదర్శి కె. అనూష, వనమహోత్సవం కింద మొక్కలు నాటకపోవడం, ఇచ్చిన మొక్కల నిర్దేశాన్ని పూర్తి చేయకపోవడమే కాక మొక్కల గురించి తప్పుడు సమాచారం ఇచ్చిన మేడారం ఫీల్డ్ అసిస్టెంట్ ఎం. శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర జిల్లా పంచాయతీ అధికారిని గురువారం ఆదేశించారు. ఆకస్మిక తనిఖీలో భాగంగా పీఏపల్లి మండలం మేడారం గ్రామ పంచాయతీని అదనపు కలెక్టర్ సందర్శించారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమ నిర్వహణ తర్వాత క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు పరిశీలించాడు. ఆ సమయంలో పంచాయతీ కార్యదర్శి కె. అనూష గ్రామంలో అందుబాటులో లేరని, ఎంపీడీవో, ఇతరపై అధికారులకు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైనట్లు తెలుసుకున్నారు. గ్రామంలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం నిర్వహించలేదని గుర్తించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా రహదారులకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించలేదని, వనమహోత్సవం కింద 2,370 మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా అందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదన్నారు. రహదారులకు ఇరువైపులా నాటిన 200మొక్కలు ఎండిపోయాయని, మొక్కలు నాటేందుకు రహదారుల ఇరువైపులా గుంతలు తవ్వించలేదని పేర్కొంటూ పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు.

మెప్మా ఉద్యోగి సస్పెన్షన్

మిర్యాలగూడ టౌన్: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మునిసిపాలిటీలోని మెప్మా విభాగంలో కమ్యూనిటీ ఆర్గనైజర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను కలెక్టర్ నారాయణరెడ్డి సస్పెండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న శ్రీనివాస్‌పై లైంగిక వేధింపులు, లంచం తీసుకున్నట్లు ఆరోపణలు రావడంతో అతనిపై మెప్మా పీడీని విచారణకు ఆదేశించారు. విచారణలో ప్రాథమికంగా ఆరోపణలు నిర్ధారణ అయిన నేపథ్యంలో శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేసినట్లు కమిషనర్ యూసుఫ్ తెలిపారు.

అడ్లూరు గ్రామాన్ని సందర్శించిన వైద్య సిబ్బంది

శాలిగౌరారం, ఆగస్టు 22: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని పలు గ్రామాల్లో డెంగీ కేసులు నమోదు అవుతున్నాయి. దీంతో వైద్య సిబ్బంది అప్రమత్తమవుతున్నారు. మండలంలో ఒకరికి డెంగీ రావడంతో నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం పెర్కకొండారం, శాలిగౌరారం, వల్లాల గ్రామాల్లో కూడా డెంగీ కేసులు నమోదు కావడంతో బాధితులను వైద్య సిబ్బంది నల్లగొండ, నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రులకు పంపించి చికిత్స చేయించారు. ప్రస్తుతం వర్షంకాలం కావడంతో అన్ని గ్రామాల్లో వైరల్ ఫీవర్లు సోకడంతో కొంతమంది ప్రైవేట్ ఆస్పత్రుల్లో మరికొందరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

పరిశుభ్రత పాటించాలి: జిల్లా మలేరియా నివారణ అధికారి

మండలంలోని అడ్లూర్ గ్రామాన్ని జిల్లా మలేరియా నివారణ అధికారి దుర్గయ్య గురువారం సందర్శించారు. వైద్య సిబ్బందితో కలిసి డెంగీ సోకిన వ్యక్తి ఇంటితో పాటు గ్రామంలోని పలు వీధులను పరిశీలించారు. ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈగలు, దోమలతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు వ్యాపించే ప్రమాదముందన్నారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. జ్వరం రాగానే గ్రామంలో ఉండే వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు. ఆయన వెంట సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు కె.సుమతి, బి.సునీత, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, పద్మ, ఆశా వర్కర్లు సునీత, కొమరమ్మ, రేణుక తదితరులు ఉన్నారు.



అడ్లూర్ గ్రామస్తులతో మాట్లాడుతున్న జిల్లా మలేరియా నివారణ అధికారి దుర్గయ్య

రేపు స్పాట్ కౌన్సిలింగ్

నల్లగొండ, ఆగస్టు 22: తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల నకిరేకల్ బాలుర కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి ఎంపీసీ విభాగంలో ఖాళీగా ఉన్న 40సీట్ల భర్తీకి ఈనెల 24 శనివారం స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మధుకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ పొందే విద్యార్థులు, మార్చి 2024 పదవ తరగతిలో ఉత్తీర్ణులై ఉండి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షలు, గ్రామీణ ప్రాంతాల వారు రూ.1.50లక్షలు ఉండాలని పేర్కొన్నారు. అర్హత గల విద్యార్థులు ఈ నెల 24న ఉదయం 9గంటలకు చెరువుగట్టులోని గల కళాశాల ఆవరణలో స్పాట్ అడ్మిషన్‌కు హాజరు కావాలని కోరారు. మరిన్న వివరాలకు సెల్: 7995010663, 7799573366 నెంబర్లలలో సంప్రదించాలని కోరారు.

బస్సు అద్దాల ధ్వంసం.. డ్రైవర్‌పై దాడి

కనగల్, ఆగస్టు 22: బస్టాప్ వద్ద ఆర్టీసీ బస్సు ఆపలేదనే కోపంతో డ్రైవర్‌పై ఇద్దరు ప్రయాణికులు దాడి చేసి బస్సు అద్దాలు ధ్వంసం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దేవరకొండ డిపోకు చెందిన బస్సుఏపీ29 - 948 గురువారం సాయంత్రం దేవరకొండ నుంచి నల్లగొండకు ప్రయాణికులతో వస్తుంది. ఈ క్రమంలో గుర్రంపోడు మండలం కొప్పోల్ గ్రామ స్టేజీ వద్ద గల బస్టాప్‌లో బస్సును ఆపలేదనే కోపంతో ఇద్దరు ప్రయాణికులు బస్సును అడ్డగించి డ్రైవర్‌పై దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. కాగా దాడి చేసిన వారిపై బస్సుడ్రైవర్ మహమూద్, కండక్టర్ షాకీరాబేగం కనగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెట్టుకు బైక్ ఢీకొని ముగ్గురికి గాయాలు

కనగల్, ఆగస్టు 22: నల్లగొండ జిల్లా కనగల్ మండల కేంద్రం గ్రామశివారులో బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన గురువారం జరిగింది. ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... గుర్రంపోడు మండలం పల్లిపాడు గ్రామానికి చెందిన మాతంగి ప్రసాద్, మామిడి సైదులు, పెద్ద ఎల్లయ్య దర్వేశిపురం ఎల్లమ్మ ఆలయం వద్ద బంధువులు నిర్వహించిన శుభకార్యానికి హాజరైన వీరు బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరారు. కాగా కనగల్ గ్రామశివారులో బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు?

కోదాడ రూరల్, ఆగస్టు 22: ఆంధ్రా ప్రాంతం నుంచి తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని సూర్యాపేట జిల్లా కోదాడ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. రెడ్లకుంట, కూచిపూడితండా, చిల్లకల్లు, నల్లబండగూడెం, దోరకుంట గ్రామాలకు చెందిన ఐదుగురు యువకులు ఆంధ్రా ప్రాంతం నుంచి గత కొంతకాలంగా గంజాయిని తీసుకొచ్చి చిన్నచిన్న పొట్లాలు చేసి గ్రామాల్లో విక్రయిస్తున్నారు. కొంతమంది వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు బుధవారం రాత్రి ఈ ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారని, వారి వద్ద నుంచి ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా, విచారణ కొనసాగుతుందని, వివరాలు త్వరలో వెల్లడిస్తామని చెప్పారు.

విశ్రాంత ఉపాధ్యాయుడిపై వానరాల దాడి

భువనగిరి టౌన్, ఆగస్టు 22: విశ్రాంత ఉపాధ్యాయుడిపై వానరాలు దాడి చేసి గాయపరిచాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లాకేం ద్రంలో గురువారం జరిగింది. స్థానిక పోచమ్మ వాడకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పోతంశెట్టి పాండయ్య(87) బుధవారం రాత్రి ఇంటి ఎదుట కుర్చీలో కూర్చున్నాడు. గుంపుగా వచ్చిన వానరాలు అకస్మాత్తుగా ఆయనపై దాడి చేశాయి. కుర్చీ నుంచి కిందపడిన ఆయన కుడి చెవిని వానరాలు కొరికి వేశాయి. అలాగే వాటి దారిలో ఒంటినిండా గాయాలయ్యాయి. ఆయన అరుపులు వేయడంతో అప్రమత్తమైన స్థానికులు, కుటుంబసభ్యులు వానరాలను తరిమివేశారు. గాయపడిన పాండయ్యను జిల్లా ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుత ఆయన ఆరోగ్యం క్షేమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే కోతుల నియంత్రణలో మునిసిపాలిటీ చూపుతున్న నిర్లక్ష్యంతోనే ప్రజలపై కోతుల నిత్యం దాడులు చేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి వానరాలను కట్టడి చేయాలని కోరుతున్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



సమావేశంలో మాట్లాడుతున్న బాలునాయక్

దేవరకొండ, ఆగస్టు 22: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం కొండమల్లేపల్లి, చందంపేట మండలాలలోని ఎంపీడీవోలు, మిషన్‌భగీరథ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మిషన్ భగీరథ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేయాలని, ట్యాంకులను శుభ్రం చేయాలని సూచించారు. గ్రామాల్లో బోర్లు, చేతిపంపులు పనితీరును పరిశీలించాలన్నారు. పనిచేయని బోర్లు, చేతిపంపులను మరమ్మతులు చేయాలని కోరారు. వర్షాలు కురుస్తున్నందున నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, దోమల బెడద అరికట్టాలని అన్నారు. గ్రామాల్లో ప్రతీరోజు పారిశుధ్య పనులు, ఫాగింగ్ నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవోలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా, ఆగస్టు 22: గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. అనుముల మండలం తిమ్మాపురం గ్రామంలో గతంలో ప్రకృతి వైపరీత్యం వల్ల నష్టపోయిన ఇళ్ల బాధితులకు బుధవారం ఆయన నష్టపరిహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తిమ్మాపురం గ్రామంలో 34 మందికి ప్రకృతి వైపరీత్యం కింద ఒక్కొక్కరికి 5,200 చొప్పున 1,76,800 రూపాయలను బాధితులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పనకు కృషి చేస్తుందని అన్నారు. అర్హులైన రైతులందరికీ రూ. 2లక్షల రుణమాఫీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అనుముల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, మునిసిపల్ ఛైర్‌పర్సన్ గౌరవ సలహాదారుడు యడవల్లి నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ జయశ్రీ, ఏఎస్‌వో రవీందర్‌రెడ్డి, నాయకులు గుర్రం సత్యనారాయణరెడ్డి, చింతల చంద్రారెడ్డి, గుర్రం అమరేందర్‌రెడ్డి, కుందూరు రాజేందర్‌రెడ్డి, రాజారమేష్‌యాదవ్, భానుచందర్‌రెడ్డి, రవి, రమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించడంపై హర్షం



సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

నల్లగొండ టౌన్, ఆగస్టు 22: ఏడున్నరేళ్లుగా పెండింగ్‌లో విద్యుత్ ఉద్యోగులు పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ వివిధ కేడర్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించడంపై విద్యుత్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సర్కిల్ కార్యాలయ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి, విద్యుత్‌శాఖమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సీఎండీ ముషారఫ్‌లతో కూడిన ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ హరీష్‌కుమార్ మాట్లాడుతూ ఏడున్నర సంవత్సరాలుగా నాటి పాలకులు పదోన్నతులు కల్పించకుండా కల్లబొల్లి మాటలతో కాలయాపన చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పదోన్నతుల విషయంపై సానుకూలంగా స్పందించిందని అన్నారు. కార్యక్రమంలో వీఏవోఏటీ అసోసియేషన్ అధ్యక్షుడు జిల్లా అధ్యక్షుడు వి. రవికుమార్, కార్యదర్శి కె.బాబురావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు పాండురంగ, తోటి వెంకటేశ్వర్లు, రా మారావు, కిషన్, మేరి జ్యోతి, క్రాంతికుమారి, సునీత పాల్గొన్నారు.

బత్తాయి తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



బత్తాయి తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

గుర్రంపోడు, ఆగస్టు 22: మండలంలో పిట్టలగూడెం గ్రామంలో బత్తాయి తోటలను నాగపూర్ శాస్త్రవేత్తలు పరిశీలించారు. తిరుపతి ఉద్యానవన యూనివర్సిటీ నుంచి అంటుబత్తాయి మొక్కలు తీసుకొచ్చి సాగు చేసినా సక్రమంగా దిగుబడి రాలేదు. రైతుల ఫిర్యాదు మేరకు నాగపూర్ శాస్త్రవేత్తల బృందం గురువా రం మండలంలోని పిట్టలగూడెంలో బత్తాయి తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బత్తాయి మొక్కల ఆకులు, కాండం పసుపు రంగులోకి మారుతున్న బత్తాయి కాయలను, మట్టి నమూనాలను శాస్త్రవేత్తలు సేకరించారు. రైతులు పాటిస్తున్న సాగు విధానాలను అడిగి తెలుసుకున్నారు. అంటుకట్టే సమయంలో తల్లిమొక్క నుంచి సరైన కొమ్మలను సేకరించి ఉండకపోవచ్చని శాస్త్రవేత్తలు అనుమానం వ్యక్తం చేశారు. నాగపూర్ పరిశోధన కేంద్రంలో అన్ని రకాలుగా పరీక్షించిన తర్వాతనే నిర్ధయానికి వచ్చి రైతులకు సరైన దిశానిర్దేశం చేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దర్శణ్ కడెం, నరేష్, తిరుగు నాన్‌నావెల్, కిరణ్‌కుమార్, వెంకటరమేష్, సురేష్‌కుమార్‌రెడ్డి, బాబు, జిల్లా ఉద్యానవన అధికారి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నల్లగొండ రూరల్, ఆగస్టు 22: పవర్ లూమ్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వం గుర్తింపుకార్డులు ఇవ్వాలని తెలంగాణ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని పద్మానగర్ పద్మశాలీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవనోపాధి కోసం 30ఏళ్ల క్రితం నల్లగొండ పట్టణానికి అనేక మంది కార్మికులు వలస వచ్చి అద్దె ఇ ళ్లల్లో నివాసం ఉంటూ పవర్‌లూమ్ కార్మికులుగా జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. ప్రభుత్వం పవర్‌లూమ్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి పీఎ ఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, గుర్తింపు కార్డులు, 50 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలకు రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్లు లేని కార్మికులకు భూమితో పాటు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని అన్నారు. సంఘం పద్మానగర్ ఏరియా అధ్యక్షుడు గంజి నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు కార్యక్రమంలో రాములు, యోగానందం పాల్గొన్నారు.

రుణమాఫీపై రైతులను మోసం చేసిన ప్రభుత్వం

● బీఆర్ఎస్ నాయకులు



నల్లగొండలో నిర్వహించిన ధర్నాలో పాల్గొని మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

నల్లగొండ, దేవరకొండ, హాలియా, మిర్యాలగూడ, చండూరు, గుర్రంపోడు, ఆగస్టు 22: రుణమాఫీ విషయంలో రేవంత్‌రెడ్డి సర్కార్ రైతులను నిలువునా మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్, నల్లమోతు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు 2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ఓట్లు వేయించుకొని గద్దెనెక్కిన ప్రభుత్వం మాట తప్పిందన్నారు. రాష్ట్రంలో 40 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదని పూటకో మాట మాట్లాడుతూ ముఖ్యమంత్రి, మంత్రులు రైతులను మోసాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అర్హులైన ప్రతీ రైతుకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కేబినెట్ సమావేశంలో రుణమాఫీ రూ.31 వేల కోట్లుగా చెప్పి బడ్జెట్‌లో రూ. 26వేల కోట్లు కేటాయించారని విమర్శించారు. ఇప్పటివరకు రూ.17.93 కోట్లు విడుదల చేసినట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రైతులందరికీ రుణమాఫీ వర్తించేంతవరకు బీఆర్ఎస్ పోరాడుతుందని అన్నారు. తిరుమలగిరిలో పార్టీ శ్రేణులపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు.

● నల్లగొండ జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో నిర్వహించిన ధర్నాలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలని, ఏఎమ్మార్పీ డిస్ట్రిబ్యూటర్ కాల్వకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులు ప్రభుత్వంపై తిరగబడే రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, నాయకులు నిరంజన్‌వలీ, చీరపంకజ్ యాదవ్, కటికం సత్తయ్యగౌడ్, మాలే శరణ్యరెడ్డి, బక్క పిచ్చయ్య, మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, కరీంపాషా, తండు సైదులుగౌడ్, బోనగిరి దేవేందర్, దేప వెంకట్‌రెడ్డి, అయితగోని యాదయ్య, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, మారగోని రమేష్, కొండూరు సత్యనారాయణ, జమాల్‌ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

● దేవరకొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, ఎస్ఎల్‌బీసీ, పెండ్లిపాకల, డిండి, నక్కలగండి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ అధికారి ముబీన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యానాయక్, పల్లా ప్రవీన్ రెడ్డి, రాజినేని వెంకటేశ్వరరావు, బాలయ్య, గాజుల ఆంజనేయులు, అంజిరెడ్డి, రాములు, బాలు, శ్రీనివాసరావు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

● హాయాలో ప్రధాన సెంటర్‌లో నిర్వహించిన ధర్నాలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులపై నిర్లక్ష్య ధోరణి పాటిస్తుందని అన్నారు. అంతకుముందు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, ఆప్కాబ్ రాష్ట్ర మాజీచైర్మన్ యడవల్లి విజయేందర్‌రెడ్డి, నాయకులు కూరాకుల వెంకటేశ్వర్లు, జానయ్య, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, రవి నాయక్, శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సుధాకర్, మొగులయ్య, సైదాచారి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● మిర్యాలగూడలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మాట్లాడుతూ రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేసేంత వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి గురించి అసభ్యకరంగా మాట్లాడినందుకు నిరసనగా తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అన్నభీమోజు నాగార్జునాచారి, ధనావత్ చిట్టిబాబు నాయక్, బైరం సంపత్, వీరకోటిరెడ్డి, రంగారెడ్డి, సైదులు, శ్రీనివాస్‌యాదవ్, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● చండూరులో అమరవీరుల స్థూపం వద్ద నిర్వహించిన ధర్నాలో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం విస్మరించిందన్నారు. రైతులకు రుణమాఫీ ఎక్కువ మందికి రాకపోవడంతో, రైతులు రోడ్డెక్కితే ప్రస్తుత ఎమ్మెల్యే తనకు మంత్రి పదవి కోసం ఢిల్లీలో లాబీయింగ్ చేసుకుంటూ తిరుగుతున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో మునిసిపల్ కౌన్సిలర్ తోకల వెంకన్న, కోడి వెంకన్న, నాయకులు కొత్తపాటి సతీష్, బొడ్డు సతీష్, మెండు మోహన్‌రెడ్డి, నాంపల్లి, మునుగోడు, మర్రిగూడ, గట్టుప్పల మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడు: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేసేంత వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్‌రెడ్డి, వజ్జ ధనుంజయ, మేకల వెంకట్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, సిరాజ్, రాములు పాల్గొన్నారు.



చండూరు : ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల



హాలియా : ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్



మిర్యాలగూడ: పాల్గొన్న భాస్కర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి



దేవరకొండ: ధర్నాలో మాట్లాడుతున్న రవీంద్రకుమార్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నాగార్జునసాగర్, ఆగస్టు22: సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర అన్నారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులను, రిజిస్టర్లను, మందుల స్టాక్ వివరాలను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యం ఎలా అందుతుందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి ఆవరణను పరిశీలించి చెత్తాచెదారాన్ని తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నగేష్, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

ఫీవర్‌సర్వేను సమర్థంగా నిర్వహించాలి : డీఎంహెచ్‌వో

మిర్యాలగూడ అర్బన్, దామరచర్ల: ఫీవర్ సర్వేను సమర్థవంతంగా చేపట్టాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ సూచించారు. పట్టణంలోని ప్రకాష్‌నగర్, దామరచర్ల పీహెచ్‌సీలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న ఫీవర్ సర్వేలో నమోదైన వివరాలు, ఆరోగ్య శిబిరాల ఏర్పాట్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఏఎన్‌ఎం, ఆశాలు ప్రతి ఇంటిని సందర్శించి ఫీవర్ సర్వే రిపోర్టును తయారుచేయాలన్నారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. వైద్యుల పనితీరు, అందిస్తున్న వైద్యసేవలపై ఆస్పత్రికి వచ్చిన రోగులను అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ జ్వరంపై ప్రైవేటు ఆస్పత్రులు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ దవాఖానాల్లో డెలివరీల శాతాన్ని పెంచాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో గీతవాణి, డాక్టర్లు నిపున్, నాగేశ్వరరావు, సిబ్బంది మోతీలాల్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై బీఆర్ఎస్ నిరసనలు హాస్యాస్పదం

● డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు, ఆగస్టు 22: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రైతు రుణమాఫీ పథకంపై బీఆర్ఎస్ నిరసనలు చేయటం హాస్యాస్పదంగా ఉందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మునుగోడు పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ తన పదేళ్ల పాలనలో రైతాంగం పట్ల సవితితల్లి ప్రేమను చూపిందని విమర్శించారు. రైతులకు రుణమాఫీ పేరుతో ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ తర్వాత మాట మార్చిందన్నారు. కేవలం ఒక లక్ష రూపాయలను నాలుగు దఫాలుగా రుణమాఫీ చేస్తామని మోసం చేసిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఎన్నికల హామీకి కట్టుబడి రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేసిందని అన్నారు. జిల్లాలో సాగు, తాగు నీటి సమస్యల శాశ్వత పరిష్కారం కోసం దోహదపడే డిండి ఎత్తిపోతల, బ్రాహ్మణవెల్లెంల పథకం ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూరి చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు పాల్వాయి జితేందర్‌రెడ్డి, నాయకులు సాగర్ల లింగస్వామి, అన్వర్, పర్వతం కురుమ, నేరటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఏడీఏగా బాధ్యతలు చేపట్టిన దేవ్‌సింగ్



దేవ్‌సింగ్

మిర్యాలగూడ, ఆగస్టు 22: మిర్యాలగూడ వ్యవసాయ సహాయ సంచాలకులుగా గురువారం దేవ్‌సింగ్ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఏడీఏగా పనిచేసిన పోరెడ్డి నాగమణి భూసార కేంద్రం అధికారిగా బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో భువనగిరిలో ఏడీఏగా పనిచేస్తున్న దేవ్‌సింగ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారులు డి.సైదానాయక్, శివకుమార్, ఏఈవో రమేష్‌నాయక్, సిబ్బంది అనిత, శ్రీకాంత్ ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సాంకేతిక మెళకువలు నేర్పాలి : డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో భిక్షపతి

దామరచర్ల, ఆగస్టు 22: విద్యార్థులకు సాంకేతిక మెళకువలు నేర్పాలని డీఈవో బిక్షపతి ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, విలువలతో కూడిన బోధన అందించాలన్నారు. అభ్యసన స్థాయిని పరిశీలించి దానికనుగుణంగా పాఠ్య ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఆదర్శ పాఠశాల మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలని పీఆర్ ఇంజనీర్ సతీష్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో బాలాజీనాయక్, అరుణ పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రల సమస్యలను పరిష్కరించాలి



మిర్యాలగూడలో నిరసన తెలుపుతున్న ఆరోగ్యమిత్రలు

పెద్దఅడిశర్లపల్లి, మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 22: ఆరోగ్యమిత్రల సమస్యలను పరిష్కరించాలని లేకుంటే సమ్మెబాట పడుతామని ఆరోగ్యమిత్రలు తెలిపారు. జిల్లాలోని దేవరకొండ, మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రుల్లో గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమ్మెనోటీస్ ఇచ్చి 17 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీ రాకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ ఉద్యోగులు మాట్లాడుతూ వేతనాలను పెంచాలని, ఆరోగ్యమిత్ర కేడర్ డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్‌గా మార్చాలని కోరారు. జీవోనెం. 60 ప్రకారం నెలకు రూ. 22వేల వేతనం చెల్లించాలని ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. వేతనాలను అవుట్ సోర్సింగ్ విధానంలో కాకుండా కాంట్రాక్ట్ ట్రస్ట్ ద్వారా చెల్లించాలని, కాంట్రాక్ట్ విధానంలోకి మార్చాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గోలి నాగరాజు, ఆరోగ్యమిత్రలు బిక్షపతి, పద్మ, రామగిరి సుధాకర్, పేరెల్లి శేఖర్, ఇందిర, రాణి, సాలయ్య, నాగరాజు, బసీరుద్దీన్, జుబేదా, సునీత, కృష్ణ పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ జరుగుతుంది : ఏడీఏ



ఏఈవోలకు సూచనలిస్తున్న ఏడీఏ శ్రీలక్ష్మీ

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 22: ప్రభుత్వం ప్రకటించిన రూ. 2లక్షల రుణమాఫీ కాని రైతులందరికీ రుణమాఫీ జరుగుతుందని దేవరకొండ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు (ఏడీఏ) శ్రీలక్ష్మీ అన్నారు. మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద గల గురువారం రైతువేదికను సందర్శించి రైతులతో మాట్లాడారు. రూ.2 లక్షలు దాటిన రైతులందరికీ రుణమాఫీ జరుగుతుందని దానికి సంబంధించి రెండు, మూడు రోజులు ప్రభుత్వం నుంచి నిబంధనలు రానున్నట్లు తెలిపారు. అదే విధంగా రేషన్‌కార్డు లేని రైతులకు కూడా రుణమాఫీ తప్పకుండా జరుగుతుందని దీనికి సంబంధించి నిబంధనలు వారం రోజుల్లో రానున్నట్లు పేర్కొన్నారు. దీని ప్రకారం అధికారులు గ్రామాల్లో సందర్శించి ఆ యొక్క వివరాలను పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్నా ఏవోకు దరఖాస్తు చేసుకుంటే వాటిని పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం మండలకేంద్రంలోని వ్యవసాయ సహకార కేంద్రం ఇతర ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. వారి వెంట ఏవో పాండు, ఏఈవోలు పాల్గొన్నారు.

ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు

నార్కట్‌పల్లి, ఆగస్టు 22: దేవాదాయశాఖకు చెందిన విలువైన భూములను అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆ శాఖ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ అనిత అన్నారు. మండలంలోని చెర్వుగట్టు, గోపలాయపల్లి వేణుగోపాలస్వామి దేవస్థానాలతో పాటు వివిధ ఆలయాలకు సంబంధించి మండలంలోని గ్రామాల్లో ఉన్న ఆలయ భూములను ఆమె గురువారం పరిశీలించారు. ఆలయాల భూముల రక్షణకు ఎండోమెంట్‌శాఖ తీసుకునే చర్యల్లో భాగంగా వాటిని త్వరలో సర్వే చేసి జియోట్యాగ్ ఇవ్వనున్న నేపథ్యంలో సర్వే చేయాల్సిన భూములను ఎండోమెంట్ అధికారులతో కలిసి ఆమె పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎండోమెంట్ తహసీల్దార్లు ఎం.విజయలక్ష్మి, గిరిధర్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ బి.సుమతి, చెర్వుగట్టు ఆలయ ఈవో నవీన్, వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానం అనువంశిక ధర్మకర్త మోహన్‌రెడ్డి, ఆలయ మేనేజర్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

చింతపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ అన్నారు. మండలంలోని వెంకటేశ్వరనగర్ రెండోఅంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అన్నప్రాసన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ బాదేపల్లి స్వప్న, ఆయా బక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: మండలంలోని ముదిగొండ గ్రామశాఖ సీనియర్ సభ్యుడు బొడ్డుపల్లి నారయ్య మృతి బాధాకరమని సీపీఐ మండల కార్యదర్శి దేపా సుదర్శన్‌రెడ్డి అన్నారు. ముదిగొండలో నారయ్య మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

శాలిగౌరారం: శాలిగౌరారంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఉన్న శ్రీ గోదాదేవి ఆల్వార్ ఆలయాలకు గోపుర నిర్మాణాలకు ఆలయ ధర్మకర్తలు, దాతలు శంకుస్థాపన చేశారు.

శాలిగౌరారం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యవరణాన్ని పెంచాలని ఎంపీడీవో గార్లపాటి జ్యోతి లక్ష్మి కోరారు. పెర్కకొండారం గ్రామంలో ఎంపీడీవో జ్యోతి లక్ష్మి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఉట్కూరులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టులో నిర్వహిస్తున్న తెలంగాణ గురుకుల కళాశాల (బాలుర) కళాశాల ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఎంపీసీ విభాగంలో ఖాళీగా ఉన్న 40 సీట్లకు ఈ నెల 24న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో తెలిపారు.

శాలిగౌరారం: మండలంలోని గురజాల గ్రామంలో వైద్యసిబ్బంది ఇంటింటా ఫీవర్ సర్వే మూడు రోజుల నుంచి చేపడుతున్నారు. కుటుంబంలో ఎంత మంది ఉన్నారు. వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది? అనే పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే తమకు సమాచారం అందించాలని కోరారు. వర్షాకాలం అయినందున పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. సర్వేలో ఆశావర్కర్ ధనలక్ష్మి, అన్వార్, జయమ్మ, అంగన్‌వాడీ టీచర్ ముత్యాల ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: గ్రామాల్లో మాదకద్రవ్యాల నిర్మూలనకు అందరూ సహకరించాలని తహసీల్దార్ ఎస్.మధుసూదన్‌రెడ్డి కోరారు. కేతేపల్లిలో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను గ్రామాల్లోకి రాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ డీపీఎం డి.మోహన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో పురుషోత్తం, ఏఎస్ఐ శ్రీనివాస్, ఏపీఎం యాదమ్మ, ఎంపీవో నాగలక్ష్మి, సమాఖ్య అధ్యక్షురాలు వినోద, సీసీలు రాజ్‌కుమార్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గట్టుప్పల్: జ్ఞానం పెంచుకోవడానికి గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని తహసీల్దార్ రాములు అన్నారు. మండలకేంద్రంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నిధులు రూ.10లక్షల గ్రంథాలయ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నామని జగన్నాథం, సామల యాదయ్య, దండు యాదగిరిరెడ్డి, సత్తయ్య పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: కుటుంబ పరిస్థితులు అనుకూలించక వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్నంత మాత్రాన ఒంటరివాళ్లమనే బాధను దరిచేరనీయవద్దని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి దీప్తి అన్నారు. మండలంలోని ఎల్లారెడ్డిగూడెం వద్ద శ్రీ వాసవీ వృద్ధాశ్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ఆశ్రయం ఉంటున్న వృద్ధులకు అందుతున్న కనీస వసతులు, భోజన పదార్థాలు, నిర్వహణ తీరును ఆమె పరిశీలించి సంతృప్తి చెందారు. సమావేశంలో సత్రం నిర్వాహకులు రంగా శేఖర్, మీలా సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: సినీ అభిమానులు సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యులు కావాలని సినీహీరో చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఉబ్బపల్లి వెంకన్న అన్నారు. చిరంజీవి జన్మదిన వేడుకలను ఇంద్ర సినిమా ప్రదర్శన జరుగుతున్న ఏసియన్ శ్రీనివాస థియేటర్‌లో నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస్, చంద్రకాంత్, శివ, సురేష్, సాయి, రఘు, సైదులు, చంటి తదితరులు పాల్గొన్నారు.

త్రిపురారం: మండలంలోని దుగ్గేపల్లి గ్రామంలో ముత్యాలమ్మ తల్లి పోతురాజుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి మేకల వెంకట్ అనే యువకుడు అన్నదానానికి రూ.20వేల విలువ చేసే సరుకులను అందజేశాడు.

నాగార్జునసాగర్: గ్రామాల్లో ఓటరు జాబితాలో తప్పులు లేకుండా బీఎల్‌వోలు చూడాలని పెద్దవూర తహసీల్దార్ పావని సరోజ అన్నారు. త్వరలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటరు జాబితాను సిద్ధం చేయాలని అన్నారు.

గుర్రంపోడు: రూ.2లక్షల రుణమాఫీతో రైతులు ఆనందంగా ఉన్నారని రాజకీయ లబ్ధికోసమే ప్రతిపక్షాలు ధర్నా చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాజకీయ ఉనికి కోసం ధర్నా చేస్తూ రైతులను అయోమయానికి గురిచేస్తున్నారని అన్నారు.

గుర్రంపోడు: గుర్రంపోడు ఎస్ఐగా వేమిరెడ్డి నారాయణరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ శివప్రసాద్ నల్లగొండలోని వీఆర్‌కు బదిలీ అయ్యారు.

బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ రూరల్, ఆగస్టు 22: వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన 5 నుంచి 18 సంవత్సరాలలోపు బాల బాలికలకు ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ (పీఎంఆర్‌బీపీ) 2025 కు సంబంధించిన బాలల వ్యక్తిగత విభాగంలో ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు ప్రదానం చేయనున్నట్లు మహిళ, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి బి.సక్కుబాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులకు దరఖాస్తు చేసుకునే వారు ఆన్‌లైన్‌లో https//awards.gov. in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. సోషల్ సర్వీస్, ప్రకృతి, క్రీడలు, కళలు సాహిత్యం, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బాలలకు వ్యక్తిగతంగా అందజేయబడుతుందన్నారు.